నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: బన్సీలాల్‌పేట్, పాటిగడ్డ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 26వ తేదీన ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం గంట నుంచి సీసీనగర్ ఫీడర్ పరిధిలోని ఏజేకాలనీ, రామాలయం, స్వస్తిక్, గాం. దీనగర్, సీసీ కమ్యూనిటీహాల్, ఉప్పలమ్మ టెంపుల్, గాంధీనగర్ కమ్యూనిటీ హాల్, ఆర్‌సీసీ కాంపౌండ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు సంజీవయ్య పార్కు ఫీడర్ పరిధిలోని సంజీవయ్య పార్కు, యోగీ బీర్, హనుమాన్ టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనత్‌నగర్: హెచ్‌పీఎస్, ఎర్రమంజిల్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు మయూరిమార్గ్, అల్లంతోటబావి, గీతాంజలి స్కూల్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్ సెంట్రల్, ఠాకూర్ హరిప్రసాద్ లేన్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, పంజగుట్ట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

నియామకపత్రం అందజేత



వెంకట్‌రాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

అమీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డి.డి.వెంకట్‌రాజ్ టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు. సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పార్టీ సీనియర్ నేత వెంకట్‌రాజ్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఇంటీవల ప్రకటించారు. బుధవారం మహేష్‌కుమార్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు భారీగా దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు విద్యార్థులు భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. వివిధ ఫ్యాకల్టీల పరిధిలోని 45 సబ్జెక్టులలోని 650 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి జరిగిన ప్రవేశ పరీక్షలో 4500 మంది అర్హత సాధించారు. వీరిలో ఇంటర్వ్యూలకు సుమారు 2800 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న కోట నీలిమ



వస్త్రాల తయారీని పరిశీలిస్తున్న కోట నీలిమ

అమీర్‌పేట: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన ఆమె ఎల్లమ్మ కళ్యాణ ఏర్పాట్లను అధికారులు, ఛైర్మన్ సాయిబాబాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి వస్త్రాల తయారీని పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు కొమ్ము రవీందర్, గోదాస్ నవీన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ కళ్యాణం నోడల్ అధికారిగా అన్నపూర్ణ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం సందర్భంగా దేవాదయ శాఖ అధికారులు ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించారు. గతంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారిగా పనిచేసిన అన్నపూర్ణను నోడల్ అధికారిగా నియమించారు.బుధవారం ఆమె ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్‌తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

పరస్పర బదిలీలు చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఉపాధ్యాయుల మ్యూచువల్ బదిలీల ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని ధర్మ టీచర్స్ యూనిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్‌లు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీవో.317 ద్వారా వివిధ జిల్లాలకు బదిలీలు చేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు పరస్పర బదిలీలకు అవకాశం కల్పిస్తూ జీవో.245 జారీ చేసిందని గుర్తు చేశారు. దీంతో 925 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా 631 మంది దరఖాస్తులు ఆమోదించి మిగతా 249 మంది దరఖాస్తులను నిలిపేశారని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్లు లేక పాదచారుల ఇబ్బంది

బౌద్ధనగర్: సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్‌లోని చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడం వల్ల వాహనచోదకులు వేగంగా వెళుతుంటారు. దీంతో పాదాచారులకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ, ఇటు ట్రాఫిక్ పోలీసులను స్థానికులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనకదుర్గ ఆలయం, బౌద్ధనగర్ పార్కు పక్కన ఉన్న చౌరస్తాలో పాదచారులు భయంభయంగా నడవాల్సి వస్తోంది. ఇటీవల జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు వచ్చి చూసి వెళ్లినా స్పీడ్ బ్రేకర్లు వేయడడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని స్పీడ్‌బ్రేకర్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన కూడలి

పలువురు బీజేపీ నేతలకు సత్కారం



వెంకటరమణిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న యాంటీ ఎమర్జెన్సీ డేను పురస్కరించుకొని అప్పట్లో మీసా చట్టం కింద జైలుకు వెళ్లిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులకు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, శ్యాం సుందర్‌గౌడ్‌లు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ 1975 లో నాటి యువ నాయకుడిగా ఉన్న వెంకటరమణిని 1976 జనవరి 26 న సత్యాగ్రహం చేసిన సందర్భంలో మీసా చట్టంకింద అరెస్టు చేసి 6 నెలలు ముషీరాబాద్ జైలులో ఉంచారన్నారు. యాంటీ ఎమర్జెన్సీ డే ను పురస్కరించుకొని అప్పట్లో ఆరెస్ట్ అయిన నేతలు వెంకటరమణితో పాటు విజయ్ కుమార్, గదిరేజి రామచంద్ర రావు, సద్గుణ చారి లను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రవిప్రసాద్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, నాగేష్ రెడ్డి, హరి, ప్రభు గుప్త, శ్యాంసుందర్, సాయి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలు అందజేత

సనత్‌నగర్: పేద మహిళ చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.15 లక్షలను బుధవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బేగంపేట వికార్‌నగర్‌కు చెందిన ఆబేదాబేగం గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. దీంతో ఎమ్మెల్యే తలాసని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో సీఎంఆర్ ఎఫ్ నుంచి రూ.1.15 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఆఫ్రోజ్‌కు ఆర్థిక సహాయం మంజూరు పత్రం (ఎల్‌ఓసీ)ని ఎమ్మెల్యే అందజేశారు.



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

రైల్వే ఆస్పత్రిలో మెరుగైన వసతులు కల్పించాలి

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌ను బుధవారం ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యాధునిక సర్జరీలకు అవసరమైన వసతులు, రోబోటిక్ సర్జరీలు, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారికి దగ్గరలో డయాలసిస్ సౌకర్యం, ఇతర ప్రదేశాల నుండి వచ్చిన రోగుల సహాయకులకు వసతి సౌకర్యం వంటికి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఫెడరేషన్ జోనల్ కార్యదర్శి యుగందర్, జాయింట్ జనరల్ సెక్రటరీ శివకుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

27న జగన్నాథ రథయాత్ర



జగన్నాథ స్వామి, బలభద్ర, సుభద్రలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని జగన్నాథ స్వామి రథయాత్ర ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు శ్రీజగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు పురుషోత్తం మలాని తెలిపారు.27న ఉదయం 6.15 గంటలకు దేవాలయాన్ని తెరిచి భక్తులకు అనుమతించి మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేస్తామని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు రథయాత్ర దేవాలయం నుంచి ప్రారంభమై సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు ఎంజీ రోడ్‌కు చేరుకుంటుందని అన్నారు.

సామాజిక సేవతో సోదర భావం పెంపొందుతుంది

కంటోన్మెంట్: సామాజిక సేవాకార్యక్రమాలతో ప్రజల్లో సోదరభావం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. వాసవి సేవా సమితి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కంటోన్మెంట్ ఐదోవార్డు వాసవీ కాలనీలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాతతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వాసవి సేవా సమితి ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు, భారీ ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఆశపడి అసలుకే మోసపోయాడు

అమీర్‌పేట: డబ్బు కోసం ఆశపడిన ఓ వ్యక్తి అసలుకే మోసపోయాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు..కూకట్‌పల్లి 6వ ఫేజ్‌లో ఉండే చీదళ్ల సురేంద్ర ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 13న రవీందర్‌సింగ్ అనే వ్యక్తి నుంచి సురేంద్రకు మెసేజ్ వచ్చింది. తరుచూ మెసేజ్‌లతో పాటు ఫోన్ కాల్స్ కూడా రాసాగాయి. రూ.1 లక్ష అసలు కరెన్సీ ఇస్తే రూ.5 లక్షల నకిలీ కరెన్సీ ఇస్తామని చెప్పారు. దీంతో బాధితుడు అంగీకరించాడు. ఈ నెల 21న ఎస్‌ఆర్ నగర్ మెట్రో స్టేషన్ వద్దకు రమ్మని చెప్పడంతో అసలు కరెన్సీ తీసుకుని అక్కడకు వెళ్లాడు. రూ.1 లక్ష కరెన్సీ ఉన్న బ్యాగును తీసుకున్న వ్యక్తులు, రూ.5 లక్షలు కలిగి ఉన్న నకిలీ కరెన్సీ బ్యాగును సురేంద్ర చేతికి ఇచ్చారు. బ్యాగు తెరిచి చూడగా అందులో పిల్లలు ఆడుకునే నకిలీ నోట్ల కట్టలు కనిపించే సరికి ఖంగు తిన్నాడు. తేరుకుని అడిగే లోపు పరారయ్యారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి గ్యాంగ్‌ను వలపన్ని పట్టుకున్నారు. ఏడుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పాడి నకిలీ నోట్లను అమాయకులకు అంటగడుతున్నట్లు గుర్తించారు. ఫస్ట్ లాన్సర్‌కు చెందిన ప్లంబర్‌గా పనిచేసే షేక్ హుస్సేన్, సంతోష్‌నగర్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ అద్నాన్, అంబర్‌పేట లాల్‌బాగ్‌కు చెందిన షోయబ్, సైదాబాద్ నివాసి మజీర్, సికింద్రాబాద్‌కు చెందిన పరుశరామ్, రాంనగర్‌కు చెందిన బెనర్జీ, బంజారాహిల్స్‌కు మహ్మద్ సల్మాన్‌లు ముఠాగా ఏర్పాడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అసిస్టెంట్ కేర్ టేకర్లను విధుల్లోకి తీసుకోవాలి

లాలాపేట: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కొంత కాలంగా పని చేస్తున్న అసిస్టెంట్ కేర్ టేకర్‌లను అకారణంగా విధుల్లో నుంచి తొలగించడాన్ని స్వేరోస్ నగర్ కార్యదర్శి కుమార్ షాను తీవ్రంగా ఖండించారు. బుధవారం ఇందిరాపార్కు వద్ద జై భీమ్ యూత్ ఇండియా ఆధ్వర్యంలో అసిస్టెంట్ కేర్ టేకర్లకు మద్దతుగా నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి కుమార్ షాను వెళ్లి పాల్గొన్నారు. జై భీమ్ యూత్ ఇండియా ఫౌండర్ ప్రెసిడెంట్ ముకురాల శ్రీహరి ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. గురుకుల పాఠశాల విద్యార్థులు భవిష్యత్ దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

బోనాల వేడుకలకు ఆహ్వానం

అడ్డగుట్ట: నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ఆషాడ మాస బోనాలు వేడుకల్లో పాల్గొనాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు దేవాదాయ శాఖకు చెందిన అధికారి రాజేష్ తో పాటు అధికారుల బృందం పద్మారావు గౌడ్‌ను మోండా మార్కెట్‌లోని ఆయన నివాసంలో కలిసి గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బల్కంపేట్ బోనాలు వేడుకల ఆహ్వాన పత్రికలను పద్మారావు గౌడ్‌కు అందించారు.

ఓయూలో అధ్యాపకుల నియామకాలు చేపట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఖాళీగా 1000కి పైగా అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని రాష్ట్ర మంత్రి దామోదర రాజనరసింహను బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్ కోరారు. బుధవారం ఓయూలో పర్యటించిన మంత్రిని ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయంలో కలసి ఓయూ సమస్యలను వివరించారు.

ఓయూలో ఇంగ్లిష్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి అనుబంధంగా కొనసాగుతున్న సెల్ట్‌లో ఇంగ్లిష్ భాషలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పది పాసై ఇంగ్లిష్ మాట్లాడలనుకునే ఉద్యోగులు, వ్యాపారులు, గృహిణులు, ఇతరులు సెల్ట్‌లో ప్రవేశానికి అర్హులు. ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే శిక్షత తరగతులకు ఆసక్తి గల అభ్యర్థులు 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని డైరెక్టర్ ప్రొ.నవీన్ పేర్కొన్నారు. రెండు నెలల పాటు జరిగే శిక్షత తరగతులు సాయంత్రం 6 గంటల నుంచి 7.30 నిమిషాల వరకు జరగనున్నట్లు చెప్పారు. వివరాలకు 7989903001 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 67, పచ్చ కాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 28, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 12, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సింగ్ తెలిపిన మేరకు.. బోయిన్‌పల్లిలోని విలాసనగర్‌కు చెందిన శ్రీనివాస్(41)కు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. తీవ్ర మనస్తాపానికి గురైన అతను మంగళవారం రాత్రి ఘట్కేసర్ - బిబినగర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా డివిజన్‌లో బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పర్యటించారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల రూప, నాగులు, హరిక్రిష్ణ, స్కైలాబ్, మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ముందుకు వచ్చి పలు సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఏకరువు పెట్టారు. మోండా డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చాలా ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినా పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదన్నారు. లష్కర్ బోనాల నేపధ్యంలో ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు, సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమీషనర్ డాకునాయక్, జలమండలి జీఎం వినోద్‌కుమార్, డిప్యూటీ జీఎం ఆశీష్, ట్రాన్స్‌కో ఏడీఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

తెలంగాణ బార్ కౌన్సిల్ ఛైర్మెన్‌కు సన్మానం



బార్ కౌన్సిల్ ఛైర్మెన్ నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న గంజి యాదగిరి తదితరులు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ బార్ కౌన్సిల్ ఛైర్మెన్ ఎ. నరసింహారెడ్డిని బుధవారం నోటరీ అడ్వకేట్ల సంఘం ఘనంగా సన్మానించింది. తెలంగాణ ప్రాక్టీసింగ్ నోటరీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గంజి యాదగిరి అధ్వర్యంలో ప్రతినిధి బృందం హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యాలయంలో ఛైర్మెన్ నర్సింహ్మారెడ్డిని ఘనంగా సత్కరించారు. అదే విధంగా వైస్ ఛైర్మెన్ కె. సునీల్ గౌడ్, కార్యదర్శి నాగలక్ష్మీలను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ ఛైర్మెన్ ఎ. నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నోటరీ అడ్వకేట్‌లకు బార్ కౌన్సిల్ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వారి సమస్యల పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర అధ్యక్షులు గంజి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ప్రాక్టీస్ చేస్తున్న నాలుగు వేల మంది నోటరీ అడ్వకేట్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం తాము పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నోటరీ అడ్వకేట్ల సంఘం అధ్యక్షులు గోలి దేవేందర్ బాబు, కార్యదర్శి మయబ్రహ్మ నర్సింహ్మ, కోశాధికారి ఏబీ నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కల్యాణం ఏర్పాట్ల విషయంలో నిర్లక్ష్యం వద్దు

డీసీపీ విజయ్‌కుమార్

అమీర్‌పేట: ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ ఏర్పాట్ల విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని వెస్టుజోన్ డీసీపీ విజయ్ కుమార్ అన్నారు.





సమావేశంలో పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న డీసీపీ విజయ్‌కుమార్

బుధవారం బల్కంపేట ఆలయ ప్రాంగణంలో పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులతో సమావేశమైయ్యారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శివసత్తులు,జోగినీలకు మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల సమయంలో దర్శనాలకు అనుమతిస్తామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ గోవర్ధన్,ఏసీపీ రాఘవేంద్రరావు,ట్రాఫిక్ ఏసీపీ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

'చిన్నతప్పు జీవితాన్ని నాశనం చేస్తుంది'



విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, నష్టాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు

బొల్లారం: విద్యార్థి దశలో వేసే చిన్నతప్పటడుగు భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. తిరుమలగిరిలోని 'అన్‌అకాడమీ'లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కాంపెయిన్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్ పట్ల ఆకర్షితులై, వాటిని సేవించడం మొదలు పెడితే కోలుకోలేని స్థాయిలో నష్టపోతారని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. డయల్ 100కు కాల్ చేసి వివరాలు ఇవ్వాలని.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమావేదవి, అన్‌అకాడెమీ డైరెక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై పోరాటం చెయ్యాలి

పంజగుట్ట: అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ (బిజేఎమ్‌సీ) జాతీయ ఛైర్మన్ బిశ్వప్రియ రాయ్ చౌదరీ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిజేఎమ్‌సీ హైదరాబాద్ అధ్యక్షురాలిగా శ్రీదేవి రమేష్‌కు నియామకపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు అర్నబ్ చటర్జీతో కలిసి బిశ్వప్రియరాయ్ మాట్లాడుతూ .. వీధి వ్యాపారులకు, భవన రంగంలో పనిచేసే కార్మికులకు, ఆటో, రిక్షా, హోటల్స్‌లో పనిచేసే వారికి కూడా లేబర్ కార్యాలయం నుండి గుర్తింపు కార్డు పొందవచ్చునని ఈ విషయం ఎవ్వరికీ తెలియదని వారికి అవగాహన కల్పించి, లేబర్ కార్డు ఇప్పించాలని సూచించారు. తెలంగాణలో మనం ప్రతిపక్ష హోదాలో ఉన్నామని బిజేఎమ్‌సీ మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతీ నిత్యం సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు.



దేశ జీడీపీపై రోడ్డు ప్రమాదాల ప్రభావం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జనార్దన్‌రెడ్డి



రోడ్డు భద్రతపై జరిగిన అవగాహన కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి

సనత్‌నగర్: రోడ్డు ప్రమాదాల కారణంగా భారతదేశ జీడీపీలో దాదాపు 3 శాతం నష్టం కలుగుతోందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి అన్నారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం 'రోడ్డు భద్రత'పై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, సన్నిహితులు, స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎడ్యుకేషన్, ఈఎంఎస్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఈ నాలుగు 'ఇ'లు రోడ్డు భద్రతలో కీలకంగా ఉంటాయన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, అతివేగం, తాగి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, రెడ్‌లైట్ జంపింగ్, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడడం కూడా ప్రాణాంతకమన్నారు. కాగా, సర్వేజన ఫౌండేషన్, కళాశాల పరస్పరం ఎంఓయూ కుదుర్చుకుని రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. జంక్షన్ల వద్ద హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వంటి కొన్ని లోగోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

విద్యార్థులను నైపుణ్యం కలిగిన వారిగా మార్చడమే ఎన్‌ఈపీ లక్ష్యం

విద్యార్థులను నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా మార్చడంలో ఎన్‌ఈపీ-2020 కీలకపాత్ర పోషిస్తుందని జనార్దన్‌రెడ్డి అన్నారు. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఐక్యూఏసీ అండ్ ఇంగ్లిష్ విభాగం సంయుక్తంగా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించాయి. జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ భారతీయ విద్యను మరింత సమగ్రంగా మార్చడమే ఎన్‌ఈపీ లక్ష్యమని అన్నారు. కనీసం ఒక నైపుణ్యాభివృద్ధి తప్పనిసరి చేయాలని, 'నైపుణ్యం వ్యక్తుల దినోత్సవం'జరుపుకోవాలని సూచించారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించడానికి సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు.